# రేషన్

★ శ్రీమతి యస్. కామేశ్వరిగారు

౧

సాయంత్రం. అందరూ షికారు వెళుతున్నారు. రోడ్డు మీద ఎటుచూచినా జనులు, రిక్షాలు, బండ్లు, లారీలు పరిగెత్తుతున్నాయి. అప్పుడు. 10 సం. పిల్లవాడు పరిగెత్తి పోతూన్న జట్కాలో ఒక గిన్నె పెట్టి బండి నెక్కుటకై నియమించిన ఇనుపబల్లపై కూర్చున్నాడు. బండివాడు మస్తుగా త్రాగి యుండుటచే గట్టిపుకళ్లెము బిగించి పట్టుకొన్నాడు. బండి వాయువేగంగా పోతున్నది. బాలుని ఆనందం చెప్పనలవి కాదు.

పిల్లడు బీదకుటుంబములోని వాడన్న సంగతి వాని ముఖము చూడగానే తెలుస్తున్నది. ఒక చిన్నలాగు. దానికి కూడా బొత్తములు లేవు. బాలుడు తన తల్లి చెప్పిన దానికంటె మిక్కిలి తొందరగా యింటికి పోతున్నానన్న ఆనందంలో తానెక్కడ కూర్చున్నదికూడా మరచిపోయేడు. ఇంతలో బండివాడు వెనుక తిరిగి చూసేడు. బాలుడు చూడలేదు వాని ఎఱ్ఱనికండ్లు. బండివాడా గిన్నెను చూసి కొఱడా కఱ్ఱతో క్రిందకు నెట్టేడు. గిన్నె చప్పుడు విని బాలుడు త్రుళ్లిపడ్డాడు. తనకు జ్ఞానంకలిగి చూసే సరికి తన గిన్నె రోడ్డుమీద దొర్లుతున్నది. అమ్మా అని ఒక్క కేకేసి రోడ్డుమీద బోర్లపడ్డాడు. బండి విమానంలాగెగిరి పోయింది.

ఆ వేళ పౌర్ణిమ. వెన్నెలలో బాలుని గిన్నెలో నుండి రోడ్డుపై పడిన గోధుమపిండి బాగా కనిపిస్తున్నది. ఇంతలో పెద్ద గాలివచ్చి పిండిని ఎగురగొట్ట మొదలు పెట్టింది. బాలుని భయదేవత వేరుతోకూడ కదలించిన చెట్టువలె నూపసాగెను. పిండి గిన్నెలో కెత్తుకుందామన్న వీలు లేకుండా యున్నది. బాలుని కేమీ తోచలేదు. చిన్న పిల్లడు. ఏడ్పు మొదలెట్టేడు. జనులు గుంపులు కూడేరు. కాని సహాయం చేసేవారు మనలో తక్కువ కాదూ, రాళ్లు విసిరేవారే కాని! రాత్రి సమీపిస్తున్నకొద్ది జనులు, ఓస్! పిండే కదూ మళ్లా విసిరించుకో అని కొందరు, పాపం పిండి ఇసుక కలిసింది. ఏ జేస్తావు వూరుకో అని కొందరూ, ఏమి మాట్లాడడానికీ తోచక ఊరికే నిలుచుని చూసేవారు కొందరూ—రకరకముల మనుష్యులందరూ వెడలిపోయేరు. పిల్లవాని కేమిచెయ్యాలో తోచక. ఎక్కడికి వెళ్లాలో యన్న గుర్తు కూడ లేక గిన్నెను పట్టుకొని మెల్లగా నడక సాగించేడు.


ఇంతలో కొందరు పిల్లలు వెన్నెలకుప్పలాడుతూ కనిపించారు. వెంటనే గోపాలుడు తన గిన్నె నొక యరుగుపై పెట్టి తానుకూడ ఆటలో మునిగి పోయేడు. పిల్లల జీవితము లెంత సుఖవంతములు. అమ్మ కొడుతుందన్న భయం తప్పితే వాళ్లకింకేముంటుంది? ఆటలోపడి గోపాలుడదికూడా మరచి పోయేడు. హాయిగ్గా వెన్నెలలో ఆడుతున్నాడు.

౨

అయ్యో! తండ్రి లేని పిల్లడు. నా రెక్కల కష్టంతో ఏవో రేషను రోజులలో పిల్లవానిని. పెంచుకుంటున్నాను. రాత్రి బాగా పొద్దుపోయింది. పిండి మరకెళ్లిన పిల్లడింకా రాలేదు. ఇదేం రేషనో. ఇచ్చిన కోటా, బియ్యమేనా అయితే పిల్లాడిని పిండిమరకు పంపనక్కర లేకపోను. ఆ యిచ్చిన గోధుమలేనా వారం రోజులూ చాలక ఎంతో అవస్థగాయుంది. నేనే పిండి మరకు పోదామంటే కూలికి వెళ్లడం మానివెయ్యాలి. కడుపు కక్కుర్తికి కూలికిపోతే, సాయంత్రం ఏడయినా వదలరాయను. ఏం చెయ్యను. పిల్లడు దారి తప్పిపోయేడో, లేక లారీక్రిందే పడిపోయేడో అంటూ విచారించి గోపాలుని తల్లి తలుపుకు తాళంవేసి బయలు దేరింది.

రోజులు బాగులేకపోతే అన్నీ కష్టాలే వస్తాయి. ఏదెలా జరగాలో, అలా జరుగుతుంది. వద్దంటే పోదు. ఖర్మని ఏడవడం తప్ప మరేమి చేయగలరు. ఎంత మహానీయులైనా, ఖర్మకు దాసులే. దీనిని తప్పించుకు తిరగలేరు. అల్లా జరిగినప్పుడందరకు వేదాంతం వస్తుంది. అంతకు ముందు వేదాంతాన్ని చూచి నవ్వేవ్యక్తే దానికి దాసుడౌతాడు.

గోపాలుని వెదుకుతూ బయలు దేరింది వాని తల్లి.



పౌర్ణమి వెన్నెల పిండారబోసినట్లుంది. గాని సందు త్రోవలలో మాత్రం చీకటి వదలి వెళ్ళనని మొండి పెట్టుకుంది. ఆ చీకటి సందులోనుంచి నడుస్తువుంది ఆమె. ఎదురుగా నలుగురు కూర్చున్నారు. ఆ నల్లని చీకట్లో వారి నల్లని ముఖాలూ, వారి దుస్తులూ కలిసిపోయాయి. "అరే-ఏ-కౌన్ హై" అన్నాడు ఒకడు వెటకారంగా. "ఔరత్ కీ జైసే దిఖాతీ హై" అని మరొకడు. గోపాలుని తల్లి :—నాయనా పది సంవత్సరాల పిల్లడు గాని ఈ త్రోవలో మీకు కనిపించేడా?" తల్లి ప్రేమ. అందులో తండ్రి లేని కొడుకుపై నున్న ప్రేమ వర్ణించగలమా! ఒక రాయి కనిపిస్తే దాన్నికూడా తన కొడుకు సంగతి తెలుసా? అని అడగాలనిపిస్తుంది కాబోలు—ఊళ్లో ఎంతమంది పది సం॥ పిల్లలున్నారో? గోపాలుని చూడడానికి వీళ్లకేం—అయినా పొగరెక్కి మస్తుగా త్రాగిన వాళ్లెక్కడ? కూలిదెక్కడ? ఆవిడకు వీళ్లు జబాబు చెప్తారా? ఆవిడ ఆత్రుత అలాగుంది. ఆ పూటకు కడుపునిండా తిండిలేని వాళ్లకు, మస్తుగా మాంసం, గుడ్డలూ, జీతం వస్తే పొగరు రాకేమిటి? నిండు కుండయితే తొణకదు. వీళ్లో సగం నిండిన కుండలాంటివాళ్లు.

"కనిపించేడు, అదుగో, ఆ కనిపిస్తున్న యింటి అరుగు మీద—" అన్నాడు మరో తుంటరి. ఈమెకు ప్రాణంలేచి వచ్చినట్లయింది. కుట్రాడు అరుగుమీద ఎందుకు కూర్చున్నాడో? పరుగెత్తింది అక్కడకు. ఆమె వెనుక వీరు నలుగురూ యమ దూతల్లాగ వెంబడించారు.

3

వెన్నెలకుప్పలాడుతూ, గోవిందు, గోపాలుడు సందు మొదటకు వచ్చేరు. ఆ యింటి స్థంభం దగ్గిరగాని కుప్పలు పోసేరేమోనని వెదుకడానికి దగ్గరకువచ్చేరు.

"ఒరే గోపాల్, ఇదెవరురా ఇక్కడ పడుకుంది"

గోపాల్ :—రోడ్డుమీద పడుకోడ మేమిటిరా అంటూ "...మాఅమ్మే—ఇక్కడ పడుకుందేం? అమ్మా—అమ్మా"—అంటూ తట్టాడామె శరీరంమీద. తల్లి పలుక లేదు. అమ్మా, నేను పిండి పారపోసేనని కోపం వచ్చిందా—పిలుస్తే పలకరుండా, నన్ను కొట్టడానికి మర్మం పెట్టేవా—ఇంటికి వేగిరం రమ్మన్నావని బండి మీద పెడితే బండి వాడు తోసేసేడు.

ఇంకెక్కడమ్మ—అమ్మకు కోపం వచ్చిందని గోవిందు డలాగే కొయ్యబారి మాస్తున్నాడు. దారి పోయేవాళ్లు గుమిగూడేరు. ఆ విడెందుకు చచ్చిపోయిందో ఎవరికి తెలుసు? పోలీసు లొచ్చేరు. గోవిందునీ, గోపాలునీ శవాన్ని అక్కడున్న వాళ్లలో కొంత మందినీ స్టేషనుకు తీసికెళ్లేరు. అంతే, సాక్ష్యంలేదు. ఎవరికీ తెలియదు ఆవిడ చచ్చిపోడానికి కారణం. డాక్టరు పరీక్షయింది. నిజం చెపుతే భయం డాక్టరుకూడా. గుండె నిలిచి పోయి చచ్చిపోయింది అన్నారు.

గోపాలు నడుగుతే ఏం చెపుతాడు—పిల్లవానిని వెదక డానికని బయలుదేరి, ఆ భయంచేత గుండె నిలిచి చచ్చి పోయిందని చెప్పి కేసు కొట్టేసేరు. నిజమెలా తేల్తుంది?

## కృతజ్ఞత

శ్రీమతి వలిచేటి లక్ష్మీ పార్వతిగారు, గుంటూరు సుందరమ్మగారు, మంత్రిప్రగడ రంగనాయకమ్మగారు, చోడగం అమ్మన్నరాజాగారు, పలచాని వెంకటరమణమ్మగారు, కస్తూరి సుభద్రమ్మగారు, ఈశ్వర సత్యవతమ్మగారు, భూపాలరావు మణీబాయమ్మగారు, వి. భగీరథీబాయమ్మగారు, పెనుమెత్స సుభద్రమ్మగారు చెరివంద రూపాయలు ఆంధ్ర మహిళాసభకు యిచ్చి యావజ్జీవ సభ్యులుగా ఎన్నుకోబడ్డారు. ఆంధ్ర మహిళాసభపై వారు ప్రకటించిన ఆదరాభిమానములకు సభపక్షమున కృతజ్ఞతను వెల్లడిస్తున్నాను.

దుర్గాబాయి
ప్రధాన కార్యదర్శిని